# ఎట్టకేలకు!

**సర్ఫరాజ్‌కు పిలుపు**

రెండో టెస్టుకు రాహుల్, జడేజా దూరం ● సుందర్, సౌరభ్ ఎంపిక

**దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. వైజాగ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరగనున్న రెండో టెస్టు కోసం సెలెక్షన్ కమిటీ సర్ఫరాజ్‌ను ఎంపిక చేసింది. రాహుల్, జడేజా గాయాలతో జట్టుకు దూరమవడంతో.. రంజీల్లో టన్నుల కొద్ది పరుగులు చేసిన సర్ఫరాజ్‌కు అవకాశం ఇచ్చింది. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌తో పాటు.. నిన్న మొన్నటి వరకు టీమ్‌ఇండియా నెట్‌బౌలర్‌గా కొనసాగిన లెఫ్టార్మ్ స్పిన్నర్ సౌరభ్ కుమార్‌ను జట్టులో చేర్చింది.**

హైదరాబాద్: మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తొలి సారి భారత జట్టుకు ఎంపిక య్యాడు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల కోసం సెలెక్షన్ కమిటీ గతంలోనే జట్టును ప్రకటించగా.. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా గాయాలతో విశాఖపట్నం మ్యాచ్‌కు దూరమవడంతో సోమవారం తాజాగా జట్టును సవరించింది. ఉప్పల్ వేదికగా జరిగిన తొలి టెస్టులో 28 పరుగుల తేడాతో ఓడిన టీమ్‌ఇండియా.. రెండో మ్యాచ్‌తో లెక్క సరిచేయాలని చూస్తున్నది. మడమ గాయంతో జడేజా, తొడ గాయంతో రాహుల్ జట్టుకు దూరం కావడంతో సెలక్షన్ కమిటీ సర్ఫరాజ్, వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్‌ను జట్టులో చేర్చింది. 'రాహుల్, జడేజా గాయాల వల్ల వైజాగ్‌లో జరగనున్న రెండో టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. తొలి పోరులో పరుగు తీస్తున్న సమయంలో జడేజా మడమ కండరం పట్టేసింది. తొడ కండరాల నొప్పి కారణంగా రాహుల్ విశ్రాంతి కోరాడు. వైద్యబృందం ఎప్పటికప్పుడు ఇద్దరినీ పర్యవేక్షిస్తున్నది. వీరి స్థానంలో సర్ఫరాజ్, సౌరభ్, సుందర్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది' అని బీసీసీఐ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత్, ఇంగ్లండ్ మధ్య వచ్చే నెల 2 నుంచి విశాఖపట్నం వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

**ఎన్నాళ్లో వేచిన ఉదయం..**

ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అందుబాటులో లేకపోవడంతో.. అతడి స్థానాన్ని భర్తీ చేసే సమయంలోనే సర్ఫరాజ్ గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే సెలెక్షన్ కమిటీ మాత్రం రజత్ పాటిదార్‌కు అవకాశం ఇచ్చింది. అదే సమయంలో ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్-'ఎ' జట్టు తరపున సర్ఫరాజ్ భారీ సెంచరీతో చెలరేగి.. ఇప్పుడు తనను ఎంపిక చేయక తప్పని పరిస్థితి కల్పించాడు. సీనియర్లు చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానేకు మరో అవకాశం ఇస్తారని ఊహించినా.. సెలక్షన్ కమిటీ మాత్రం యువ ఆటగాళ్ల వైపే మొగ్గుచూపింది. సుదీర్ఘ ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరైన సర్ఫరాజ్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 45 మ్యాచ్‌ల్లో 3,912 పరుగులు చేశాడు. ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. భారత టెస్టు జట్టు ఎంపిక జరిగిన ప్రతిసారీ.. రంజీల్లో మంచినీళ్ల ప్రాయంలా పరుగులు చేస్తున్న సర్ఫరాజ్ పేరు బలంగా వినిపించేది. అయితే ఫిట్‌నెస్, ప్రవర్తన కారణంగా పోటీలో వెనుకబడిన ఈ ముంబైకర్ ఎట్టకేలకు జాతీయ జట్టులో అవకాశం దక్కించుకున్నాడు. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు.. ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలబడగల సత్తా ఉన్న సర్ఫరాజ్ రెండో టెస్టు తుది జట్టులో చోటు దక్కించుకుంటాడా చూడాలి!




### అప్పుడు నెట్‌బౌలర్‌గా..

2021లో ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు వచ్చిన సమయంలో నెట్‌బౌలర్‌గా ఉన్న సౌరభ్ కుమార్.. ఈసారి మెయిన్‌ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ 30 ఏండ్ల ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్‌కు తుది జట్టులో చోటు దక్కడం కష్టమే అయినా.. సీనియర్ల సహచర్యంలో ఎదిగేందుకు చక్కటి అవకాశం దక్కినట్లైంది. 'భారత జట్టుకు ఎంపికవడం నా కల. అది సాధ్యమైనందుకు ఆనందంగా ఉంది. ఈ అవకాశం కోసం దేశంలో ఎందరో యువకులు ఎదురు చూస్తూ ఉంటారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోబోతున్నాననే భావన నన్ను నిలువనివ్వడం లేదు' అని సౌరభ్ పేర్కొన్నాడు.

**రెండో టెస్టుకు భారత జట్టు:**
రోహిత్ (కెప్టెన్), గిల్, యశస్వి, శ్రేయస్, భరత్, ధ్రువ్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ముఖేశ్, బుమ్రా, అవేశ్, రజత్ పాటిదార్, సర్ఫరాజ్, సుందర్, సౌరభ్.



## సోనమ్‌కు రజతం

కైరో: ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత యువ షూటర్ సోనమ్ మస్కర్ రజత పతకం సొంతం చేసుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో తొలిసారి బరిలోకి దిగిన సోనమ్ రెండో స్థానంలో నిలిచింది. సోమవారం జరిగిన పోటీల్లో సోనమ్ 252.1 పాయింట్లతో వెండి పతకం కైవసం చేసుకుంది. అన్నా జాన్సెన్ (జర్మనీ), అనెటా స్టాంకోవిచ్ (పోలాండ్) వరుసగా స్వర్ణ, కాంస్యాలు గెలుచుకున్నారు. మరోవైపు మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. రీథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

## ఐదో స్థానానికి భారత్

**డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టిక**



దుబాయ్: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి పడిపోయింది. హైదరాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్ ఆరంభంలో పట్టు కనబర్చిన రోహిత్ సేన.. ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమైన విషయం తెలిసిందే. ఇటీవల దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను డ్రా చేసుకున్న భారత్ డబ్ల్యూటీసీ పట్టికలో టాప్ ప్లేస్ చేజిక్కించుకోగా.. తాజా ఫలితంతో బంగ్లాతర్వాతి స్థానానికి చేరింది. 55 పాయింట్లతో ఆస్ట్రేలియా టేబుల్ టాపర్‌గా కొనసాగుతుండగా.. ఆ తర్వాత వరుసగా దక్షిణాఫ్రికా (50), కివీస్ (50), బంగ్లా(50), భారత్ (43.33) ఉన్నాయి.

## బుమ్రాకు మందలింపు



దుబాయ్: ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో నిబంధనలను అతిక్రమించినందుకు గానూ.. భారత ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఐసీసీ మందలించింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో భాగంగా ఓలీ పోప్ పరుగు తీస్తుండగా.. బుమ్రా ఉద్దేశపూర్వకంగా బ్యాటర్‌ను అడ్డుకున్నట్లు మ్యాచ్ రిఫరీ నిర్ధారించాడు. దీంతో ఐసీసీ లెవల్-1 తప్పిదం.. కోడ్ ఆఫ్ కాండక్ట్ ఆర్టికల్ 2.12 ప్రకారం బుమ్రాను మందలించడంతో పాటు.. ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించాడు. గత 24 నెలల్లో బుమ్రా చేసిన తొలి తప్పిదం కావడంతో.. అతడికి స్వల్ప శిక్ష పడింది. మ్యాచ్ అనంతరం బుమ్రా తప్పు అంగీకరించడంతో.. తదుపరి విచారణ అవసరం లేదని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## హైదరాబాద్ ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మూలపాడు (ఆంధ్రప్రదేశ్) వేదికగా జరుగుతున్న బీసీసీఐ మహిళల అండర్-23 సీనియర్ వన్డే టోర్నీలో హైదరాబాద్‌కు ఓటమి ఎదురైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 5 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 246 పరుగులు చేసింది. గొంగడి త్రిష(65), త్రిష పూజిత(57) అర్ధసెంచరీలతో రాణించారు. ఆర్చనాదేవి(5/47) ఐదు వికెట్లతో విజృంభించింది. లక్ష్యఛేదనలో యూపీ 49.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. శోభాదేవి(97) అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించింది.

## స్ట్రాంజా టోర్నీలో నిఖత్

న్యూఢిల్లీ: బల్గేరియా వేదికగా ఫిబ్రవరి 1 నుంచి మొదలయ్యే ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా స్మారక టోర్నీకి భారత యువ బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గోహై ఎంపికయ్యారు. సోమవారం జాతీయ బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) 19 మందితో కూడిన జట్టును ప్రకటించింది. మహిళల విభాగంలో నిఖత్, లవ్లీనతో పాటు ప్రీతి, సాక్షి, మనీశ, అరుంధతి చోటు దక్కించుకున్నారు. పురుషుల కేటగిరీలో అమిత్, బరుణ్‌సింగ్, సచిన్, ఆకాశ్, వన్షజ్, రజత్, ఆకాశ్, దీపక్, అభిమన్యు, జుగ్ను, నవీన్‌కుమార్, సాగర్ ఉన్నారు.

## 60 ఏండ్లలో తొలిసారి..

**పాక్‌కు భారత జట్టు**

ఇస్లామాబాద్: డేవిస్ కప్ కోసం భారత టెన్నిస్ జట్టు గత 60 ఏండ్లలో తొలిసారి పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టింది. వచ్చే నెల 3,4 తేదీల్లో జరిగే డేవిస్ కప్ వరల్డ్ గ్రూపు 1 ప్లేఆఫ్‌లో భాగంగా పది మందితో కూడిన భారత టెన్నిస్ బృందం ఆదివారం పాక్‌కు చేరుకుంది. ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో తమకు ఘన స్వాగతం లభించిదని ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్(ఏఐటీఏ) అనిల్ దూపుర్ పేర్కొన్నారు. సోమవారం మూడు గంటల పాటు ప్రాక్టీస్ చేశామని తెలిపారు.



## రఫ్ రైడర్స్ గెలుపు జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ పోటీలు గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ కోర్స్‌లో ఉత్కంఠగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన మూడో రౌండ్‌లో రఫ్‌రైడర్స్ 92 పాయింట్లతో గ్రూపు-బిలో అగ్రస్థానంలో నిలిచింది. ఆరుగురు గోల్ఫర్లు అత్యధికంగా 32 పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. గ్రూపు-ఎలో ఎలో స్టోనెక్స్, మైసా 83 పాయింట్లు దక్కించుకున్నాయి. గ్రూపు-సిలో ఎజైల్ 81 పాయింట్లు, గ్రూపు-డిలో సింతోకెమ్ 84 పాయింట్లతో టాప్‌లో నిలిచాయి. మూడు రౌండ్లు పూర్తయ్యేసరికి టీమ్ అల్ఫా 482 పాయింట్లతో అగ్రభాగాన కొనసాగుతున్నది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.